క్లుప్తంగా

వాల్మీకిపురం సీఐగా ప్రసాద్ బాబు



వాల్మీకిపురం: వాల్మీకిపురం సీఐగా ప్రసాద్ బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా రాయదుర్గం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాత్రి గస్తీని ముమ్మరం చేసి, వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. వాహనదారులు హెల్మెట్ వాడాలని, కారులో సీటు బెల్టు పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

మైనింగ్ మాఫియాను అరికట్టండి

–సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె సిటీ: అధికార పార్టీ అండదండలతో చెలరేగి పోయి ఇసుక, మట్టిని కొల్లగొడుతున్న మైనింగ్ మాఫియాను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇసుక విధానం కారణంగా జిల్లాలో ఉన్న ప్రజలకు ఇసుక అందుబాటులోకి లేకుండా పోయిందన్నారు. భవన నిర్మాణం పనులు జరగడం లేదని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. మైనింగ్ మాఫియా అధికార పార్టీ అండదండలతో పెద్ద ఎత్తున ఇసుకను తరలించుకుపోతున్నారని ఆరోపించారు. పట్టణ సమీపంలోని చిప్పిలి సమ్మర్‌స్టోరేజీట్యాంకు వద్ద ప్రతి రోజు టిప్పర్లతో ఇసుకను తోడి తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని తెలిపారు. మైనింగ్‌మాఫియా కు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

వర్షం కోసం పొలిమేర గంగమ్మ జాతర

కలికిరి: వర్షం కోసం మండలంలోని చీకటిపల్లి గ్రామం రంగనాథపురంలో ఆదివారం గ్రామ పొలిమేర గంగమ్మ జాతర నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో గ్రామదేవతకు పూజలు నిర్వహిస్తే వానలు కురుస్తాయన్న ప్రజలు నమ్మకంతో ఇలా పూజలు చేయడం ఆనవాయితీ. ప్రస్తుతం వర్షాలు కురవక వర్షాధార వేరుశనగ ఎండుముఖం పడుతుండటంతో గ్రామస్తులు పొలిమేర గంగమ్మ జాతర చేశారు. అలాగే గ్రామం సమీపంలోని పాడుబడ్డ రుబ్బురోళ్ళు, బండరాళ్ళను గ్రామం పొలిమేర దాటించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుర్రంకొండ: స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదివారం రీడ్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నీతి కథలు అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు మొత్తం 59 మంది పోటీల్లో పాల్గొన్నారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు త్వరలోనే అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యామలమ్మ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు



అంతక్రియల్లో పాల్గొన్న నాయకులు

తంబళ్లపల్లె: మండంలోని కన్నెమడుగు గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్యామలమ్మ మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కన్నెమడుగులో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ అభివృద్ధి, వైఎస్సార్‌సీపీకి వారి కుటుంబం చేసిన కృషి మరపురానిదన్నారు. మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు.ఉదయం 5, 6.30 గంటలకు మదనపల్లె బయలుదేరి కొండకు చేరుకుంటాయన్నారు. తంబళ్లపల్లె రాగిమానుసర్కిల్ నుంచి సాయంత్రం వరకు కొండకు షటిల్ సర్వీసులు తిప్పుతామన్నారు.

నిలకడగా టమాటా ధరలు

- మార్కెట్లో కిలో రూ.30 నుంచి రూ.36
- పదిహేను రోజులుగా ధరల నిలకడ
- జిల్లాలో 1650 మెట్రిక్‌టన్నులకు పెరిగిన టమాటాల స్టాకు



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు నిలకడ నిలిచాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.30 నుంచి రూ.36 వరకు ధర పలుకుతోంది. గత పదిహేను రోజులుగా మార్కెట్లో ఇవే ధరలు నిలకడం ఉండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ప్రసుతం 1650 మెట్రిక్ టన్నులకు టమాటాల స్టాకు మార్కెట్లకు వస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

18595 ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డుల పరిధిలో ప్రస్తుతం 18595 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. నెల రోజులుగా జిల్లాలో టమాటా పంట దిగుబడి పెరిగింది. గత రెండునెలలతో పోల్చితే ప్రస్తుతం జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో ఎంతో కొంత టమాటా పంట దిగుబడి వస్తోంది. నెల రోజుల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 8675 ఎకరాల్లో మాత్రమే టమాటా పంట దిగుబడి వచ్చింది. అప్పట్లో ధరలు బాగా పుంజుకోవడంతో పాటు ఎండల వేడిమి తగ్గడంతో జిల్లాలోని పడమటి మండలాల రైతాంగం టమాటా పంట సాగుపై దృష్టిసారించింది. దీంతో రోజు రోజుకు పంట దిగుబడి పెరుగుతోంది.

మార్కెట్లో నిలకడగా ధరలు

ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో టమాటా ధరలు నిలకడగా ఉన్నాయి. నెలరోజుల కిందట 25 కిలోల టమాటాల క్రేట్ ధర రూ.2200 వరకు ధరలు పలికాయి. అప్పట్లో టమాటా పంట దిగుబడి తక్కువగా ఉండడంతో పాటు బయట రాష్ట్రాల్లో టమాటాకు మంచి గిట్టుబాటు ధరలు ఉండేవి. ప్రస్తుతం పదిహేను రోజులుగా మార్కెట్లో ధరలు కొంచెం హెచ్చుతగ్గుదలగా 25 కేజీల టమాటా క్రేట్ రూ.750 నుంచి రూ.900 వరకు ధరలు పలుకుతండడం గమనార్హం. ప్రస్తుతం మొదటిరకం టమాటాకిలో రూ.36, రెండో రకం కిలో రూ.28, మూడో రకం రూ.17 వరకు ధరలు పలుకుతున్నాయి.

గత వారం రోజులుగా స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధర (25 కేజీల క్రేట్)
12	1634	రూ. 845
13	1463	రూ.820
14	1538	రూ.875
15	1635	రూ.790
16	1525	రూ.810
17	1492	రూ. 750
18	1624	రూ. 900

825 నుంచి 1635 మెట్రిక్ టన్నులకు పెరిగిన స్టాకు

జిల్లాలో నెలరోజుల క్రితం 825 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మార్కెట్లకు వచ్చేది. అధిక ఎండలకు టమాటా తోటలు దెబ్బతిని అప్పట్లో 820 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే మన జిల్లాలోని టమాటా మార్కెట్లకు వచ్చింది. ప్రస్తుతం టమాటా పంటల సాగుతో పాటు దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో జిల్లాలోని టమాటా మార్కెట్లకు ప్రతిరోజు 1635 మెట్రిక్ టన్నుల వరకు టమాటా స్టాకు వస్తుండడం గమనార్హం. జిల్లాలో ఎండల ప్రభావం తగ్గడంతుపాటు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులు కారణంగా టామటా తోటల్లో దిగుబడి పెరుగుతోంది.

ధరలు మరింత పెరిగే అవకాశం

రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. నెల రోజుల క్రితం వరకు ఎండల ప్రభావంతో టమాటాల దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. ఎండలకు టమాటాలపై బొబ్బలు, మెత్తబడిపోవడం జరుగుతోంది. దీంతో బయట రాష్ట్రాలకు టమాటాలను తరలించే అవకాశముండదు. బయట రాష్ట్రాలకు టమాటాలు తరలించాలంటే కనీసం 4 నుంచి 6 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న టమాటాలు ఎక్కువ రోజులు స్టాకు ఉంచుకొనే అవకాశముంది. బయట ప్రాంతాల్లో భారీ వర్షాలు పడి అక్కడి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో బయట రాష్ట్రాల్లో టమాటాలకు మంచి డిమాండ్ ఏర్పడి ఇక్కడి టమాటాల ధరలు మరింత పెరిగే అవకాశముంది.

ఆశించిన స్థాయిలో స్టాక్



మార్కెట్లలో టమాటా ధరలు కొద్దిరోజులుగా నిలకడగా ఉంటున్నాయి. పదిహేనురోజులుగా మార్కెట్లో 25 కిలోల టమాటా క్రేట్ ధరలు రూ.750 నుంచి రూ.900 వరకు ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లకు టమాటాల స్టాకు ఆశించినంత మేరకు పెరుగుతోంది. దీంతో బయట ప్రాంతాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ధరలు మరికొన్నిరోజుల పాటు ఇలాగే నిలకడగా ఉండే అవకాశముంది.

– కుమార్‌రెడ్డి,
మార్కెట్‌కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

డిజిటల్ అసిస్టెంట్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్

మదనపల్లె సిటీ: గ్రామ వార్డు సచివాలయాల్లో చేస్తున్న పంచాయతీ సెక్రటరీ–6 డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో జిల్లా కార్యవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్ చానల్, ఖచ్చితమైన జాబ్ చార్ట్ అమలు చేయాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులను డేటా ఎంట్రీ ఆపరేటరుల్లా పరిగణిస్తున్నారన్నారు. ఉద్యోగుల లాగిన్స్ డిజిటల్ అసిస్టెంట్ చేత చేయించడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు వారికి ఉన్న క్వాలిఫికేషన్ దృష్ట్యా ప్రభుత్వశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు కళ్యాణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గ్రామ సచివాలయ సెక్రటరీ గ్రేడ్–6 డిజిటల్ అసిస్టెంట్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా కె.రెడ్డిరాణి, కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా హసన్, సుప్రియ, అదనపు కార్యదర్శిగా మల్లికార్జున, ఉప కార్యదర్శులుగా దిలీప్,రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా మహేష్,సారిక, బాలాజీ, అశోక్, హర్షద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కిషోర్, పబ్లిసిటీ సెక్రటరీగా మోమన్, ఈసీ మెంబర్లుగా నాగరాజు, మల్లికార్జున, రెడ్డిశేఖర్‌లను ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారానికి నూతన యూనియన్ కృషి చేస్తుందన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె: జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టు టౌన్ ఎస్.ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం టు టౌన్ పరిధిలోని చేనేతనగర్ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15120 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వైభవంగా ముత్తు మారమ్మ జాతర

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీ ముత్తు మారమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున అంబళ్లను సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై ఆహ్వానం మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. జాతరను పురస్కరించుకుని పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గంపా సుధాకర్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధుయాదవ్, మధురాజు, మహబూబ్ బాషా, నరసింహారెడ్డి, ఎముక దుర్గయ్య, యోగీశ్వర్‌రెడ్డి, అన్నం నాగేంద్ర మూర్తి, పాలగిరి సుధాకర్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక అనపగుట్టలో వెలసిన శ్రీ కృష్ణాలయంలో ఆదివారం కృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 24న స్వామి శివానంద గీతా భజన మండలి సభ్యులచే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. 26న కృష్ణాష్టమి పురస్కరించుకుని ఉదయం అభిషేకాలు,పూజలు 9 గంటలకు రుక్మిణి,సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్మునికి కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. 11.30 గంటలకు చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.సాయంత్రం 3 గంటలకు స్నపనోత్సవం, 4 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తాదులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పిడుగుపాటు బాధితులను ఆదుకోవాలి



బాధితులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : భవనంపై పిడుగుపడి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలో శనివారం పిడుగుపాటుకు నష్టపోయిన బొడిశెర్ల సుబ్బరాయుడు, బోగా బాలకృష్ణల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిడుగు పడిన సమయంలో బాలకృష్ణ గృహంలో అందరూ దైవదర్శనానికి వెళ్లడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. కానీ ఆస్తినష్టం వాటిల్లిందని చెప్పారు. అదే విధంగా సుబ్బరాయుడు ఇంటి పైఅంతస్తుపై పిడుగు పడిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. వీరి కుటుంబాలలో విద్యుత్ పరికరాలు పూర్తి స్థాయిలో పాడైయ్యాయని తెలియజేశారు. అదే విధంగా బాలకృష్ణ గృహంలో రేకులు దెబ్బతిన్నాయని తెలియజేశారు. పిడుగు పడిన విషయం కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ప్రభుత్వం వీరి కుటుంబాలను తక్షణమే ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డి.బాస్కర్‌రాజు, పి.విశ్వనాథరెడ్డి, దండు గోపి, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, అరిగెల సౌమిత్రి, స్థానిక నాయకులు మాడా క్రిష్ణయ్య, బొడిశెర్ల శివయ్య, బోగా రాజా, పి.చిన్నవీరయ్య, ఎస్.వెంకటసుబ్బయ్య, డి.రామయ్య పాల్గొన్నారు.

రచయిత త్యాగమూర్తి శర్మ మృతికి నివాళి



త్యాగమూర్తిశర్మ (ఫైల్)

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత, మరసం వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు పురాణం త్యాగమూర్తిశర్మ(75) అనారోగ్యంతో శనివారం రాత్రి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. సోమవారం ఆయనకు మదనపల్లెలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. స్థానిక పెంచుపాడు రోడ్డులో నివాసమున్న త్యాగమూర్తిశర్మ మదనపల్లె రచయితల సంఘం (మరసం)వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. మరసంలో ఎంతో మంది యువ రచయితలను ప్రోత్సహించారు. ఆయన మదనపల్లె నాడు–నేడు అనే పుస్తకం రచించారు. పోతన భాగవతం, సర్వలఘు కందాలు,కవి చౌడప్పవి బూతులే కావు..నీతులు అనే పుస్తకాలు రచించారు. దీంతో పాటు పలు అనువాదాలు చేశారు. నాటకరంగంపై ఆసక్తితో మదనపల్లె నాటక కళా పరిషత్ స్థాపక సభ్యునిగా పనిచేసి ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దారు. రోటరీ సంస్థలో గౌరవ సభ్యునిగా పని చేశారు. రోటరీ బుల్లెటిన్ ఎడిటర్‌గా పనిచేశారు. 18 సంవత్సరాలు లోక్‌అదాలత్ సభ్యునిగా చేశారు. స్థానిక జిడ్డు కృష్ణమూర్తి లైబ్రేరియన్‌లో లైబ్రేరియన్‌గా పని చేశారు.

మరసం నివాళి

స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో ఆదివారం త్యాగమూర్తిశర్మ మృతికి సభ్యులు నివాళులు అర్పించారు. ఆయన మరణం తీరని లోటని తెలిపారు. మరసంకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మరసం కార్యదర్శి యుగంధర్‌చారి, సభ్యులు నాగవంశీధర్, శ్రీనివాసులు, రాంమోహన్‌నాయుడు, రాంమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, శరత్‌బాబు, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు రాజు

పీలేరు రూరల్ : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.ఎం. రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ ప్రాంగణంలో ఎన్‌ఎంయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎన్‌ఎంయూ ముందుంటుందని తెలిపారు. అనంతరం వైఎస్సార్ మజ్దూర్, ఎంప్లాయిస్ యూనియన్ల నుంచి పది మంది ఎన్‌ఎంయూలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షులు సి.వి. రమణ, యూనియన్ నాయకులు ఎ.ఎస్. మణ్యం, సుధాకర, రెడ్డెప్ప, రమణ, యల్లయ్య, హరి, ఆదిరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రాత్రి గస్తీని ముమ్మరం చేయండి



మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్రారావు

వాల్మీకిపురం: మండలంలో రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని రాయచోటి డీఎస్పీ రామచంద్రారావు తెలిపారు. ఆదివారం ఆయన వాల్మీకిపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేసి దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్ బాబు, పులిశేఖర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా



రెడ్డెమ్మ కొండ ఆలయంలో భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించారు. పలువురు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న వర్రె కోటేశ్వరరావు

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడాలని విశ్వ హిందూ పరిషత్ ప్రధాన వక్త ప్రాంత సహ కార్యదర్శి వర్రె కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక దేవళంవీధిలోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ హిందూ సమ్మేళనం జరిగింది. భారతదేశంలో హిందుమతంకు ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. విహెచ్‌పి హిందూమతం ఆచార వ్యవహారలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేస్తోందన్నారు. ప్రధానంగా గోవధలను అడ్డుకోవడంతో ఎన్నో గోవులను కాపాడినట్లు తెలిపారు. మతమార్పిడిలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. బండెన్న ఆశ్రమ పీఠాధిపతి లక్ష్మిపతి హిందూమతం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలోబీజెపి సీనియర్ నాయకులు వరదారెడ్డి నారదరెడ్డి, క్రిష్ణవేణి, ప్రాంత సామాజిక సమరసత సేవా ప్రముఖ్ చింతపర్తి మహేష్, గట్టి రామమోహన్,మదనపల్లె జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం: ఈ నెల 19 నుంచి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేఎస్. బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో భాగంగా 19న గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్ విభాగం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక వనరుల లభ్యం, 20న పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్ర స్థాయి పర్యటన, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అంశాలపై విశ్లేషణ, 21న శిక్షణ అంశాలపై పరీక్ష నిర్వహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. తనతో పాటు ఈవోఆర్డీ, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు రిసోర్స్ పర్సన్లుగా సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తారని ఎంపీడీఓ వెల్లడించారు.

కలికిరి: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, ద్రవ, ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ, వీధి దీపాలు, పారిశుధ్యం నిర్వహణపై రీఫ్రెషర్ శిక్షణ జరుగుతుందని, కార్యక్రమానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నుంచి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



క్యాండిల్ ర్యాలీ నిర్వస్తున్న సేవా సంకల్ప అసోషియేషన్ సభ్యులు

కలికిరి: కలకత్తాలో జరిగిన వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం రాత్రి కలికిరిలో సేవా సంకల్ప అసోషియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయం వద్దనుంచి గాంధీ కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తూ నిందితులను శిక్షించాలని నినదించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రియాజుల్లా(పండు), లక్ష్మీ, ఇనాయతుల్లా, అజయ్, శేషు, రాజేంద్రప్రసాద్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

చింతమాకులపల్లెలో ఉచిత వైద్యశిబిరం



సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని చింతమాకులపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 131 మందికి వైద్యసేవలు అందించారు. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 47 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 104 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ బ్రహ్మరెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సృజన, డాక్టర్ అరుంధతి, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీమ్, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బ్రహ్మజెముడు పూలు



అటవీ ప్రాంతంలో ఉండే బ్రహ్మజెముడు చెట్టు సన్నని కంపలతో నిండి ఉంటుంది. అయితే చెట్టులో పూలు, కాయలు కాయడంతో అందరిని ఆకట్టుకుంటుంది. మదనపల్లె రూరల్ మండలం సీటీఎం వద్ద అటవీ ప్రాంతంలో బ్రహ్మజెముడు ఓ చెట్టులో ఎర్రటికాయలతో మరో చెట్టు పసుపు పూలతో నిండిపోయింది. చూపరులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

– మదనపల్లె సిటీ